సాక్షి
వికారాబాద్
ఆదివారం । 7 । మే । 2023



క్రీడా పండుగకు సమాయత్తం
క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం చీఫ్ మినిస్టర్స్ కప్ పేరిట క్రీడా పండుగకు శ్రీకారం చుట్టారు. 8లో▸



ఇళ్లు అద్దెకు ఇవ్వొద్దు
గుర్తుతెలియని వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇవ్వొద్దని పోలీసులు సూచించారు. కరన్‌కోట్ గ్రామంలో పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. 8లో▸



పరిహారం కోసం పడిగాపులు
అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. పరిహారం కోసం పడిగాపులు కాస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

‘బాలాజీ చిట్ ఫండ్స్’ ఆస్తుల జప్తు

ఎస్పీ కోటిరెడ్డి

తాండూరు టౌన్ : కోర్టు ఉత్తర్వుల మేరకు పట్టణంలోని బాలాజీ చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆస్తులను జప్తు చేస్తున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి శనివారం తెలిపారు. బాలాజీ చిట్ ఫండ్స్‌లో చీటీలు వేసిన, డిపాజిట్‌లు చేసి మోసపోయిన వారిలో కొందరు గతేడాది ఆగస్టులో తాండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించామన్నారు. దర్యాప్తులో 78 మంది సాక్షులను నమోదు చేశామన్నారు. నిందితుడైన గంగిశెట్టి శ్రీనివాసులును రిమాండ్ చేశామన్నారు. అలాగే గంగిశెట్టి గోపాలకృష్ణ, అనురాధ, సరితను విచారించామన్నారు. వారి పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను సేకరించి ప్రభుత్వం ద్వారా ఆస్తులను జప్తు చేసేందుకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టును సంప్రదించగా, జప్తు చేయాల్సిందిగా శనివారం ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కేసు పూర్తి విచారణ చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎస్పీ అన్నారు.

ఠాక్రేను కలిసిన రామ్మోహన్‌రెడ్డి



ఠాక్రేతో మాట్లాడుతున్న రామ్మోహన్ రెడ్డి

పరిగి: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నగరానికి వచ్చిన ఠాక్రేను గాంధీభవన్‌లో కలిసి పార్టీ పరిస్థితులపై చర్చించారు. కార్యకర్తలతో అనునిత్యం సమష్టిగా ముందుకు వెళ్తూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నామన్నారు ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలపడుతోందని, రానున్న ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ప్రిన్సిపాల్ సుమతి

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, పరిగి గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి అన్నారు. శనివారం బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో సమ్మర్ స్పెషల్ ఎడ్యుకేషన్ క్యాంప్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యానికి పదునుపెట్టి అధ్యాపకులు, కోచ్‌లు సూచించిన సలహాలు పాటిస్తూ రాణించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్ కుమార్, స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగారం నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సంఘర్షణ సభకు తరలిరండి



మాట్లాడుతున్న మహ్మద్ యూసుఫ్

కొడంగల్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈ నెల 8న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ సంఘర్షణ సభకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని రేవంత్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి నిరుద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా వస్తున్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. నేటికీ నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్, మైనార్టీ అధ్యక్షుడు కొడంగల్ నయీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్‌రెడ్డి, సంజీవరెడ్డి, సోమశేఖర్, దాము, ఆసిఫ్‌ఖాన్, రాము తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న చీకట్లు.. దీపాల్లేక ఇక్కట్లు



విద్యుత్ లైట్లు వెలగక చీకటిగా ఉన్న ఓ కాలనీ

అంధకారంలో శివార్లు
- కానరాని కొత్త లైట్ల ఏర్పాటు
- ప్రతి నెలా రూ.5.50లక్షలు బిల్లులు
- అయినా చర్యలు శూన్యం
- దృష్టిసారించని అధికారులు

వికారాబాద్ అర్బన్: ఏడాది కాలంగా వికారాబాద్ మున్సిపాలిటీలో చీకట్లు కమ్ముకున్నాయి. మున్సిపల్‌లోని అన్ని వార్డుల్లో ఎక్కడా కనీసం కొత్త ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయలేని దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లతో పాటు, శివారు వార్డుల పరిస్థితి అధ్వానంగా ఉంది. 2017లో ఈఈఎస్‌ఎల్ (ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) సంస్థ రాష్ట్రంలోని పలు మున్సిపాల్టీలతో ఒప్పందం చేసుకున్నట్లే వికారాబాద్ మున్సిపల్‌తో కూడా ఒప్పందం కుదుర్చుకుంది. ఐదు ఏళ్ల పాటు విద్యుత్ ఎల్‌ఈడీ లైట్ల బిగింపు, వాటి నిర్వహణ బాధ్యత మొత్తం సదరు సంస్థనే చూసుకోవాలి.

నెలకు రూ.5.50 లక్షలు

అవసరమైన లైట్ల బిగింపు, మరమ్మతు కోసం వికారాబాద్ మున్సిపల్ ప్రతి నెలా సదరు సంస్థకు రూ.5లక్షల 50వేలు చెల్లిస్తోంది. పెద్ద మొత్తంలో డబ్బులు సదరు సంస్థకు చెల్లిస్తున్నా ఏడాది కాలంగా కొత్తగా విద్యుత్ బల్బులు సరఫరా చేయలేదు. సంస్థ ఉద్యోగులు పాత వాటిని కూడా మరమ్మతు చేయడం లేదు. ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర విద్యుత్ లైట్లు కావాలని అనేక సార్లు లెటర్లు రాసినా స్పందనలేదని సమాచారం. మున్సిపల్ పాలకవర్గం సైతం దాదాపు 150 ఎల్‌ఈడీ విద్యుత్ లైట్లు, ఇతర లైట్లు మరో 200 వరకు కావాలని తీర్మానం చేసి పంపినా సదరు సంస్థ స్పందించడం లేదు. కానీ బిల్లులు మాత్రం నెలనెలా తీసేసుకుంటున్నారు.

పాతవాటితోనే సరి

ఆయా వార్డుల్లో విద్యుత్ లైట్లు మరమ్మతుకు చేరితే ఇక అంతే.. వాటి గురించి ఎవరూ పట్టించుకోరు. చిన్న వర్షం వచ్చినా, గాలి వీచినా లైట్లు పనిచేయడం లేదు. తమ వార్డుల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రతి వార్డు నుంచి వినతులు భారీగా పెరిగాయి. మద్గుల్ చిట్టంపల్లి, గురుదుపల్లి, ధన్నారం, బూర్గుపల్లి, గెరిగెట్‌పల్లి వంటి శివారు గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. సాయంత్రం 6గంటల దాటితే చీకట్లు కమ్ముకుంటుండటంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు.

సంస్థ స్పందించడంలేదు



ఏడాది కాలంగా సదరు సంస్థ స్పందించడం లేదు. ఉన్నతాధికారుల ద్వారా తీవ్రంగా ఒత్తిడి చేయడంతో రెండు నెలల క్రితం కొన్ని విద్యుత్ లైట్లు వచ్చాయి. వాటిని అత్యవసరం ఉన్న చోట ఏర్పాటు చేశాం. ప్రతి నెలా రూ.5.50లక్షలు సదరు సంస్థకు విద్యుత్ లైట్ల ఏర్పాటు, నిర్వహణ కోసం చెల్లిస్తున్నాం. అయినా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. వార్డుల నుంచి వినతులు అధికం కావడంతో మున్సిపల్ సిబ్బందితోనే పాత వాటిని మరమ్మతు చేసి బిగిస్తున్నాం. సుమారు 500 కొత్త ఎల్‌ఈడీ లైట్లు కావాలని సీఎండీఈకి కూడా విన్నవించాం.

– శరత్ చంద్ర, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్

‘సంరక్షణ’లో ప్రథమం

వైద్య సేవల్లో జిల్లా ముందంజ
- మాతా శిశువులకు మెరుగైన సేవలు
- కరోనా టీకాలు వేయడంలోనూ ముందు వరుసే
- అన్ని ఆస్పత్రుల్లోనూ కాన్పులు
- రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు
- పర్యవేక్షణ మెరుగుపడటమే కారణం



ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అయిన మహిళ...

వికారాబాద్: వైద్య సేవల్లో ఎప్పుడూ వెనుకబడి ఉండే మన జిల్లా ఎట్టకేలకు ముందు వరుసలోకి వచ్చింది. ఇటీవలి కాలంలో వైద్య సేవలు మెరుగయ్యాయి. ఆరోగ్య సేవల్లో ప్రధానంగా చెప్పుకునే మాతా శిశు సంరక్షణ సేవల్లో అన్ని స్థానాలు ఎగబాకి మొదటి స్థానానికి చేరుకుంది. ఏప్రిల్ మాసానికి గాను ప్రభుత్వం స్కోరింగ్ ఇవ్వగా వందకు 80.35 మార్కులతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. 79 మార్కులతో మెదక్ రెండో స్థానంలో నిలవగా 43 మార్కులతో నిర్మల్ జిల్లా చివరి (33) స్థానంలో నిలిచింది. అనుమతులు లేని ఆస్పత్రులు, ల్యాబ్‌లు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లీనిక్‌లపై కొరడా ఝుళిపించిన డీఎంహెచ్‌ఓ పల్వాన్‌కుమార్ సంస్థాగతంగాను ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా చర్యలు చేపట్టారు. దీంతో వైద్యారోగ్య శాఖలో మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దాని ఫలితంగానే ఆస్పత్రులలో కాన్పులు, వైద్యం (ఏఎన్‌సీ), కాన్పు తరువాత తల్లిపిల్లల సంరక్షణ (పీఎన్‌సీ) తదితర అంశాల్లో మెరుగైన సేవలందించటం ద్వారా జిల్లా మొదటి ర్యాంకుకు చేరుకుంది.

అన్ని సేవల్లోనూ ఆదర్శమే..

చాలా రకాల వైద్య సేవల్లో జిల్లా ఐదు లోపు స్థానాల్లో ఉండగా మాతా శిశు సంరక్షణలో మాత్రం మొదటి స్థానంలో నిలిచింది. ఇందులో ప్రధానంగా మూడు అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ (ప్రెగ్నెన్సీ కాన్ఫార్మ్ చేయటం) ఇది రాష్ట్ర వ్యాప్తంగా 90 రోజులకు జరుగుతుండగా మన జిల్లాలో 84వ, రోజు లోపే ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నారు. ఇమ్యునైజేషన్ (వ్యాధి నిరోధక టీకాలు), ఇనిస్టిట్యూషనల్ (ఆస్పత్రులలో ప్రసవాలు) డెలవరీలు చేయడంలో మన జిల్లా ముందు వరుసలో నిలిచింది. జిల్లాలో వంద శాతం కాన్పులు ఆస్పత్రులలోనే జరుగుతుండగా ఇందులో అత్యధికంగా ప్రభుత్వ ఆస్పత్రులలోనే నిర్వహిస్తున్నారు. 31 శాతం ప్రసవాలు మాత్రమే ప్రైవేటు ఆస్పత్రులలో జరుగుతున్నాయి. తల్లులలో ఎనిమియా (రక్త హీనత) రాష్ట్ర సగటు 29 శాతం ఉండగా మన జిల్లాలో 10 శాతం మాత్రమే ఎనిమియా కేసులు నమోదవుతున్నాయి.

టీకాల విషయంలోనూ..

కరోనా టీకాల విషయంలో ఫస్ట్, సెకండ్ డోస్‌లతో పాటు బూస్టర్ డోస్ వరకు జిల్లాలో 90 శాతం పూర్తి చేశారు. ఈ విషయంలో రాష్ట్రంలో మన జిల్లా టాప్ ఫైవ్‌లో ఉంది. ప్రభుత్వ ల్యాబ్‌లలో టెస్టుల నిర్వహణ, ఏఎన్‌సీ, పీఎన్‌సీ చెకప్‌లు, కరోనా టీకాలు వేయటం తదితర అన్ని రకాల సేవల్లో మన జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలోపే ఉంది. సగానికి పైగా సేవల్లో ఒకటి, రెండు, మూడు స్థానాల్లో నిలిచింది.

హైరిస్క్ కేసులు ఉంటే..

జిల్లాలో మొత్తం 24 ప్రాథమిక (పీహెచ్‌సీ) ఆరోగ్య కేంద్రాలు, 134 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో ఏడు రౌండ్ దీ క్లాక్ (24 గంటలు పని చేసే) పీహెచ్‌సీలు ఉన్నాయి. ఉన్న ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రితో పాటు రౌండ్‌దీ క్లాక్ పీహెచ్‌సీలన్నింటిలో కాన్పులు చేస్తున్నారు. హైరిస్క్ కేసులుంటే జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. ఈ ప్రభుత్వం ద్వారా సేవలందిస్తున్న ఇనిస్టిట్యూషనల్ అన్నింటిలో వైద్యులు, వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

అందరి సహకారం వల్లే..



ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్ ఆరోగ్య సేవల విషయంలో నిరంతరం గైడ్ చేస్తున్నారు. అలాగే ఉద్యోగులు, సిబ్బంది సైతం కష్టపడి పని చేస్తున్నారు. అందుకే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ర్యాంకులతో పని లేకుండా ప్రజలకు మరింత సేవలందివ్వాలనే లక్ష్యంతో సమన్వయంతో పని చేస్తున్నాం. దాని ఫలితమే ఈ మెరుగైన ఫలితాలు. గ్రామీణ ప్రాంత పేదలు ప్రభుత్వ ల్యాబ్‌లను వినియోగించుకోవాలి. జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ల్యాబ్‌లో దాదాపు 48 రకాల టెస్టులు చేసుకునేందుకు వీలుంది. ఇవన్నీ ఫ్రీగానే చేస్తారు. ప్రజలు టెస్టుల కోసం జిల్లా కేంద్రానికి కూడా రావాల్సిన పనిలేదు. వారికి అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలలో రక్త నమూనాలు ఇస్తే టెస్టులు నిర్వహించి ఫోన్ ద్వారా రిజల్టు అందజేస్తాం. దీన్ని ప్రజలు వినియోగించుకోవాలి.

– పల్వాన్‌కుమారన్, జిల్లా వైద్యాధికారి



● దంచికొట్టిన వాన

వికారాబాద్‌లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లపై వర్షంపునీరు పారింది. అప్పటివరకు తీవ్ర ఎండతో ఉక్కపోతగా ఉన్న వాతావరణం వర్షంతో ఒక్కసారిగా చల్లబడింది. పరిసర గ్రామాల్లోనూ వర్షం పడింది.

– అనంతగిరి

తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదే



మాట్లాడుతున్న న్యాయవాది వెంకటేశ్

అనంతగిరి: చట్టాలపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ న్యాయవాదులు వెంకటేశ్, రాము అన్నారు. ఈ మేరకు శనివారం వికారాబాద్ మండలంలోని సర్పన్‌పల్లిలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చీఫ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ న్యాయవాదులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ సంరక్షణ బాధ్యత వారి పిల్లలదేనన్నారు. క్రిమినల్ కేసులు ఉండి న్యాయవాదిని పెట్టుకోలేని వారికి న్యాయసేవా అధికార సంస్థను సంప్రదిస్తే వారి అర్హతను బట్టి ఉచితంగా న్యాయవాదిని నియమిస్తారని తెలిపారు. అలాగే రైతులకు ఏవైనా న్యాయ సమస్యలు ఉంటే సలహా ఇచ్చి తగిన న్యాయం కోసం ప్రయత్నం చేస్తుందన్నారు. భూ తగాదాల సమస్యలలో సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి విజయరాణి, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



చింతమణిపట్నం గ్రామం

పదేళ్లుగా మద్యపాన నిషేధం

- ఆదర్శంగా నిలుస్తున్న చింతమణిపట్నం
- గ్రామస్తుల సంపూర్ణ సహకారం

తాండూరు రూరల్: పల్లెల్లో మంచినీళ్లు దొరకని ఊరు ఉందేమోకానీ.. మందు దొరకని ఊరు లేదంటే అతిశయోక్తిలేదు. కిరాణా దుకాణాల్లోనూ విచ్చలవిడిగా మందు అమ్ముతున్న ప్రస్తుత పరిస్థితుల్లోనూ పదేళ్లుగా మద్యం నిషేధం అమలు చేస్తూ చింతమణిపట్నం ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామస్తులంతా ఊరిలో మద్యం అమ్మకాలను నిషేధించారు. తీర్మానం చేసి పదేళ్లు అవుతున్నా ఇప్పటికీ కఠినంగా అమలు చేస్తున్నారు. గ్రామంలో 800 వందల మంది నివాసం ఉంటున్నారు. వారంతా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

2012లో నిర్ణయం

చింతమణిపట్నం గ్రామంలో 2012లో గ్రామ పెద్దల సమక్షంలో మద్యం అమ్మవద్దు.. ఎవరూ తాగవద్దని తీర్మానం చేశారు. ఎవరైనా విక్రయిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని నిర్ణయించారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో మద్యం విక్రయాలు లేవు.

గ్రామస్తుల సహకారంతో



గ్రామస్తులు, యువకుల సహకారంతో మద్యపాన నిషేధం విధించారు. గ్రామంలో ఎవరూ మద్యం విక్రయించరు. నిషేధం అందరి సహకారంతోనే సాధ్యమైంది. గ్రామంలో గొడవలు లేకుండా అందరం ఐక్యంగా ఉంటున్నాం. ఇంకా పదేళ్లు అయినా మద్యం జోలికెళ్లం.

– విమలమ్మ, సర్పంచ్, చింతమణిపట్నం

మంచి నిర్ణయం



చింతమణిపట్నంలో మద్యం పాన నిషేధం కొనసాగడం అభినందనీయం. మద్యపాన నిషేధం మంచి నిర్ణయం. ఈ గ్రామంలో అందరూ సోదరభావంతో ఐకమత్యంగా ఉంటున్నారు. మిగతా గ్రామాలు కూడా చింతమణిపట్నంను ఆదర్శంగా తీసుకోవాలి.

– మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ, కరన్‌కోట్

చదువు, విలువలే అసలైన ఆస్తులు

- విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- షాద్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డిగ్రీ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

షాద్‌నగర్: ప్రతిఒక్కరూ తమ పిల్లలకు ఇవ్వాల్సిన అసలైన ఆస్తులు చదువు, విలువలేనని మంత్రి సబితారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.1.55 కోట్లతో చేపట్టిన అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని తెలిపారు. పేద విద్యార్థుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తున్నామని స్పష్టంచేశారు. ఇందులో భాగంగానే తొమ్మిదేళ్లలో వెయ్యి గురుకుల పాఠశాలలు, 1,200 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, 80 గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. గతంలో అమ్మాయిలను చదివించేందుకు తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో వీరి ఆలోచన ధోరణిలో మార్పు వచ్చిందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా మెరుగైన బోధన అందుతోందని వివరించారు. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గుర్తింపు సాధించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీ మేరకు 3,800 మంది కాంట్రాక్టు లెక్చరర్లను సీఎం కేసీఆర్ రెగ్యులరైజ్ చేశారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పిల్లలకు చదువు, విలువలు లేనప్పుడు ఎంత ధనం కూడబెట్టి ఇచ్చినా ఉపయోగం ఉండదనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని సూచించారు. సీఎం కేసీఆర్ వ్యవసాయానికి సైతం తగిన ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.

నాణ్యత పాటించాలి

మన ఊరు– మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ స్కూళ్లు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి సబితారెడ్డి అన్నారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని, విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు గదుల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, ప్రజాప్రతినిధులు, నాయకులు అగ్గనూరు విశ్వం, విశాల, చెట్ల పావని, నర్సింలు, జూపల్లి కౌసల్య, శంకర్, సర్వర్ పాషా, ప్రేమలత, యుగేందర్, వెంకట్‌రాంరెడ్డి, నందకిషోర్, కృష్ణవేణి, జమృద్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపల్ భానుప్రకాశ్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, పాల్గుణి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.5 కోట్లు

మహేశ్వరం: ఆలయాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ భారీగా నిధులు విడుదల చేస్తున్నారని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరాలయం, ఫ్యాబ్‌సిటీలోని శ్రీవేంకటేశ్వర ఆలయం, బాలాపూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, ఆర్‌కేపురంలోని ఖిల్లా మైసమ్మ, జిల్లెల్‌గూడలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలకు రూ.కోటి చొప్పున మొత్తం రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయనిస్పష్టంచేశారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య, మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రేమ వివాహం చేయలేదని..

యువతి ఆత్మహత్య

తాండూరు టౌన్: ప్రేమించిన యువకుడితో వివాహం చేయలేదని మనస్తాపం చెందిన యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం తాండూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన పలు కుటుంబాలు ఐదు నెలల క్రితం పట్టణంలోని మల్‌రెడ్డిపల్లికి వలస వచ్చాయి. ఇక్కడి ఇటుక బట్టీల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. వీరిలో డలీమో(19) అనే యువతి తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది. అదే ఇటుక బట్టీలో పనిచేసే ఓ యువకుడిని కొంత కాలంగా ప్రేమిస్తోంది. అతనితో వివాహం చేయాలని పలుమార్లు తల్లిదండ్రులను కోరింది. వారు దాటవేస్తూ వచ్చారు. ఇటీవల యువతి తల్లిదండ్రులు ఒడిశా వెళ్లారు. ఈ సమయంలో యువతి ఆత్మహత్య చేసుకుంది. అయితే కొన్ని రోజులుగా ఆమె మానసిక పరిస్థితి సరిగ్గా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి సోదరి సానుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


నర్సింలు(ఫైల్)

పెద్దేముల్: గుండెపోటుతో మండలంలోని దుగ్గాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింలు శుక్రవారం రాత్రి మృతి చెందారు. 2015 నుంచి 2023వరకు దుగ్గాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. మూడేళ్లలో ఉద్యో విరమన చేయాల్సి ఉంది. అకస్మాత్తుగా గుండె నొప్పి రాడడం మృతి చెందారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది సంతాపం తెలిపారు. శనివారం తాండూరులో అంత్యక్రియలు నిర్వహించారు.

'పెండ్యాల'కు డాక్టరేట్



అనంతగిరి: ధారూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన పెండ్యాల నర్సింహులు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆయన గద్వాల డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగాధిపతిగా, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కస్టమర్ స్టాటిస్‌స్ఫెక్షన్ నెట్‌వర్క్ రూరల్ ఏరియా ఆఫ్ కామారెడ్డి డిస్ట్రిక్ట్ కాంపిటేటీవ్ బిట్వీన్ బీఎస్‌ఎన్‌ఎల్ అండ్ రిలయన్స్ జియో అనే అంశాలపై ప్రొ. కృష్ణమోహన్ నాయుడు ఆధ్వర్యంలో చేసిన పరిశోధనలకు గాను నర్సింహులుకు ఈ అరుదైన గౌరవం దక్కింది. నర్సింహులు డాక్టరేట్ అందుకోవడంపై మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పెళ్లి పేరిట వేధింపులు

కొందుర్గు: పెళ్లయిన వ్యక్తి ఓ యువతిని పెళ్లి పేరిట వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కొందుర్గు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. బైరంపల్లికి చెందిన పీ శ్రీకాంత్‌కు ఇదివరకే వివాహం జరిగింది. అయితే అదే గ్రామానికి చెందిన మరో యువతి కే అనూష(22)ను ప్రేమ పేరిట వేధించడం మొదలు పెట్టాడు. పెళ్లి చేసుకుంటానని గ్రామంలో చెప్పాడు. అంతేకాకుండా ఆ యువతికి వచ్చిన పెళ్లి సంబంధాలను కూడా చెడగొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం యువతి సోదరుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

క్రీడా పండుగకు సమాయత్తం

15నుంచి పల్లెల్లో పోటీలు

- చీఫ్ మినిస్టర్స్ కప్ -2023 పేరిట ఆటలు
- మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు..
- నిర్వహణకు నిధులు, కమిటీల నియామకం
- 15 నుంచి 36 ఏళ్ల వారు అర్హులు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

దౌల్తాబాద్: చాలా ఏళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సంబరం నెలకొననుంది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం చీఫ్ మినిస్టర్స్ కప్ –2023 పేరిట క్రీడా పండుగకు శ్రీకారం చుట్టారు. పోటీల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవలే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సంబంధిత ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం పోటీల నోటిఫికేషన్ విడుదలైంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడలు సజావుగా సాగేందుకు కమిటీలను వేసి, నిధులు సైతం విడుదల చేశారు. 15 నుంచి 36 ఏళ్ల వారు అర్హులు.

మండల స్థాయిలో 5 క్రీడాంశాలు

మండల స్థాయిలో జరిగే పోటీలకు ఎంపీపీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎంపీడీఓ మెంబర్ కన్వీనర్‌గా, జెడ్పీటీసీ, తహసీల్దారు, ఎంఈఓ, ఎస్సై, పీడీ, పీఈటీలు సభ్యులుగా వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకు రూ. 15వేలు మంజూరు చేశారు. 5 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పురుషులకు ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 15నుంచి 17వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి.

జిల్లా స్థాయిలో 11 క్రీడాంశాలు

జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు చైర్మన్‌గా కలెక్టరు, వైస్ చైర్మన్‌గా ఐపీఎస్ అధికారి, కో వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్, కన్వీనర్‌గా జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి, సభ్యులుగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, డీఈఓ, మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకు రూ. 75వేలు మంజూరయ్యాయి. 11 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్‌తో పాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తారు. ఈ నెల 22నుంచి 24వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి.

రాష్ట్ర స్థాయిలో 18...

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడా శాఖ మంత్రి చైర్మన్‌గా, శాట్స్ చైర్మన్ కో చైర్మన్‌గా, ప్రిన్సిపల్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, శాట్స్ ఎండీ కన్వీనర్‌గా, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కమిషనర్ మున్సిపల్, కమిషనర్ పంచాయతీ రాజ్, కమిషనర్ జీహెచ్‌ఎంసీ, డిప్యూటీ డైరెక్టర్లు సభ్యులుగా ఉంటారు. 18 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ నెల 28నుంచి 31వ తేదీ వరకు పోటీలు జరుగుతాయి.

నగదు బహుమతి...

రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతి ఇవ్వనున్నారు. వ్యక్తిగత విభాగంలో మొదటి స్థానానికి రూ. 20వేలు, ద్వితీయ స్థానానికి రూ. 15వేలు, తృతీయ స్థానానికి రూ. 10వేలు ఇస్తారు. టీం విభాగంలో మొదటి స్థానానికి రూ. లక్ష, ద్వితీయ స్థానానికి రూ. 75వేలు, తృతీయ స్థానానికి రూ. 50వేలు ఇవ్వనున్నారు.

గుర్తుతెలియని వ్యక్తులకు ఇళ్లు ఇవ్వొద్దు

- తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్
- కరన్‌కోట్‌లో కార్డెన్ సెర్చ్


మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు రూరల్: మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శనివారం సాయంత్రం తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ స్థాయి పోలీసులు పాల్గొన్నారు. నాలుగు గంటల పాటు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలించారు. ధ్రువపత్రాలు లేని 72 బైకులు, ఫోర్ విలర్స్ 2, 3 విలర్స్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ, నాపరాతి గనులు ఉండడం వల్ల వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు వస్తారని తెలిపారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇవ్వొద్దని సూచించారు. అనుమానాస్పద స్థితిలో వ్యక్తులు తిరిగితే 100కు డయల్ చేయాలని సూచించారు. మద్యం తాగి గొడవలు పడకుండా అందరూ అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉండాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, విద్యాచరణ్‌రెడ్డి, అన్వేష్, రషీద్, విమల పాల్గొన్నారు.

నిర్వహణ గాలికి..

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలో ఓపెన్ జిమ్‌ల నిర్వహణ అధ్వానంగా మారింది. ఒక్కో జిమ్ ఏర్పాటుకు మున్సిపల్ శాఖ సుమారు రూ. 10లక్షల వరకు ఖర్చు చేసింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా నిర్వహణ గాలికి వదిలేయడంతో వాటిని వినియోగించడానికి ప్రజలు ఇష్టపడడం లేదు. వికారాబాద్‌లోని గాంధీ పార్క్, సాకేత్‌నగర్ పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. జిమ్ పరికరాలకు గ్రీస్ వంటిది పెట్టకపోవడంతో శబ్దం వస్తున్నాయి. దీంతో వ్యాయామం చేసేందుకు ఆసక్తి చూడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు జిమ్‌లను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.


గాంధీ పార్కులోని ఓపెన్ జిమ్

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి


జంగయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

కుల్కచర్ల: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. అనారోగ్యానికి గురై శంషాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు కే జంగయ్యను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకట్, అంబేడ్కర్ సంఘం చౌడాపూర్ మండల అధ్యక్షుడు సీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సబ్‌స్టేషన్ పనులు

ఎమ్మెల్యే మెతుకు ఆనంద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: కేరెల్లి గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని, త్వరలో స్థల ఎంపిక పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు. మీతో నేను కార్యక్రమంలో భాగంగా శనివారం బాచారం, కేరెల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేరెల్లిలో విద్యుత్ సరఫరా మెరుగుకు సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికీ వచ్చేలా నల్లా కనెక్షన్లు ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి సోమవారం పశువైద్య అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఏఎంసీ చైర్మన్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'రేషన్' అక్రమాలను సహించం

విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రాజు


రేషన్ కార్డుదారులతో మాట్లాడుతున్న విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రాజు

దోమ: రేషన్ బియ్యం సరఫరాలో అక్రమాలను సహించేది లేదని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రాజు హెచ్చరించారు. శనివారం సాక్షి దినపత్రికలో అరకొర కోటాతో అవస్థలు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గుండాల గ్రామంలోని రేషన్ దుకాణాన్ని సందర్శించి స్టాక్‌తోపాటు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రేషన్ సరఫరాలో ఇబ్బందులు ఎందుకు తలెత్తుతున్నాయని సంబంధిత అధికారి మల్లికార్జున్‌రావును ప్రశ్నించారు. ఇన్‌చార్జ్ డీలర్ వల్లే అవకతవకలు జరిగాయని, సంబంధిత డీలర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతుంటే మీరేం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి అక్రమాలకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే రేషన్ డీలర్‌ను నియమించాలని సూచించారు.

దొంగతనానికి వచ్చి.. ఒకరిని చంపి..

ఆగాపల్లిలో కూలీ హత్య

మంచాల: దొంగతనానికి వచ్చిన దుండగులు.. అక్కడే నిద్రిస్తున్న ఓ కూలీని హత్య చేశారు. ఈ సంఘటన మంచాల మండలం ఆగాపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్‌ఆర్ పెట్రోల్ బంక్ యజమానికి సంబంధించిన మామిడి తోటలో యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలం చిన పడిశాల గ్రామానికి చెందిన రామచంద్రయ్య దంపతులు తోటమాలిగా పని చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన సుక్క సోమయ్య (70)ను కూలి పని కోసం పిలుపించుకున్నారు. శుక్రవారం రాత్రి భోజనాలు చేశాక.. రామచంద్రయ్య అతని భార్య గదిలో నిద్రించగా.. సోమయ్య మాత్రం వరండాలో నిద్రించాడు. అర్ధరాత్రి కొంతమంది దుండగులు తలుపులు తీయాలని బెదిరించారు. రామచంద్రయ్య దంపతులు భయపడి తలుపులు తీయలేదు. దీంతో ఆగ్రహించిన దుండగులు.. బయట నిద్రిస్తున్న సోమయ్య తలపై బలంగా కొట్టి పరారయ్యారు. వారు వెళ్లిపోయిన తర్వాత తలుపులు తీసి చూడగా.. సోమయ్య తల పగిలి రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉన్నాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటేశ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దుండగులు తలపై బలంగా కొట్టడంతో సోమయ్య చనిపోయి ఉంటాడని, అందుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని సీఐ వెంకటేశ్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి దుండగులను పట్టుకుంటామని చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించండి

మొయినాబాద్ రూరల్: వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని టీపీఎస్‌ఎఫ్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ అశ్వక్ బైగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వీవోఏల చేపట్టిన సమ్మె శనివారం నాటికి 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అశ్వక్ బైగ్, వీవోఏల చేవెళ్ల డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ మాట్లాడారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు లేకపోవడంతో పాలన పూర్తిగా స్తంభించి పోయిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్, శంషాబాద్ మండలం పంచాయతీ జూనియర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు పక్క నిలిచిన లారీని..

ఢీకొట్టిన మరో లారీ

- డ్రైవర్ దుర్మరణం
- రెండు గంటలు శ్రమించి మరో వ్యక్తిని బయటికి తీసిన పోలీసులు


రెండు లారీల మధ్య ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీసేందుకు యత్నిస్తున్న పోలీసులు

ధారూరు: రోడ్డు పక్కన నిలిచిన లారీని మరో లారీ అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని ఆరంపూర్ తండా బస్‌స్టేజి వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. శనివారం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. తాండూరు నుంచి సిమెంట్ బస్తాల లోడ్‌తో హైదరాబాద్‌కు వెళుతున్న లారీ రాంపూర్‌తండా సమీపంలో సాంకేతిక లోపంతో ఆగిపోయింది. దీంతో డ్రైవర్ లారీని రోడ్డు పక్కన ఆపాడు. ఈ లారీని తాండూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న మరో లారీ వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ నడుపుతున్న డ్రైవర్ సౌరబ్‌సింగ్ అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడు బీహార్ రాష్ట్రం, మనహాపూర్ జిల్లా, మోహన్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. లారీలో ఉన్న మరో వ్యక్తి విస్తెకర్ రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోవడంతో రెండు గంటల పాటు శ్రమించి బయటికి తీశారు. అనంతరం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ ప్రమాద స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు సీపీఎం మద్దతు


జేపీఎస్‌లకు మద్దతు తెలుపుతున్న వెంకటయ్య తదితరులు

పరిగి: పంచాయతీ జూనియర్ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించి, వెంటనే వారిని రెగ్యులరైజ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం వెంకటయ్య డిమాండ్ చేశారు. తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెకు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సామెల్, విగ్నేష్, సత్తయ్య, శేఖర్‌రెడ్డి, నవీన్, పాండు, రమేశ్, పంచాయతీ జూనియర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న పశువుల పట్టివేత

కడ్తాల్: ఆమనగల్లు వైపు నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్న పశువుల లారీని కడ్తాల్ టోల్ గేట్ వద్ద స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి తెలిపిన వివరాలు.. ఒడిశాలోని నోరంగపూర్ నుంచి లారీలో 107 పశువులను నగరంలోని బహదూర్‌పూర మార్కెట్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. లారీ డ్రైవర్ సయ్యద్ హుస్సేన్, క్లీనర్ అర్జున్, లారీ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. అనంతరం పశువులను జియాగూడ గోశాల తరలించారు.


కర్ణాటక ఎన్నికల ప్రచారానికి వెళుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కొడంగల్ సరిహద్దులో శనివారం బీజేపీ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈటలను కలసిన వారిలో పున్నం చంద్, కే వెంకటయ్య తదితరులు ఉన్నారు. – కొడంగల్

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి

షాద్‌నగర్: మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, పథకాల గురించి ప్రజలకు వివరించి, వారిని చైతన్య పరచాల్సిన బాధ్యత ఆశా వర్కర్లపై ఉందని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి అన్నారు. షాద్‌నగర్‌లోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో ఐదు రోజులుగా ఆశా వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. శనివారం ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆశా వర్కర్లకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ.. పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్న విషయాన్ని వివరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సూపర్ వైజర్లు విద్యుల్లత, మెర్లిన్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి దంపతులతో స్థానిక నేతలు

మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతుల కుమార్తె మనీషారెడ్డి నిశ్చితార్థం హిమదీప్‌రెడ్డితో శుక్రవారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కేఎస్ రత్నం, ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి తదితరులు హాజరై.. కాబోయే దంపతులను ఆశీర్వదించారు. – తాండూరు